# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :99 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: బుధవారం 18-06-2025 పేజీలు:4 వెల: 2.00


## జూలైలో పక్కాగా స్థానిక ఎన్నికలు?

హైదరాబాద్, ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న స్థానిక ఎన్నికలకు ఒక అడుగు ముందుకు పడింది. సోమవారం నిర్వహించిన మంత్రుల సమావేశం కీలక నిర్ణయం తీసుకుంది. జులైలో లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. అయితే ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలా..? లేదా ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్ పెట్టి తర్వాత పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలా..? అన్నదానిపై కేబినెట్ లో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఇవాళ కీలక అంశాలపై చర్చ జరిగింది. ప్రధానంగా రైతుభరోసా, స్థానిక సంస్థల ఎన్నికలపైనే డిస్కషన్ జరిగింది. ఇవాల్టి సమావేశంలో స్థానిక ఎన్నికలపై కీలక నిర్ణయం వెలువడనుందని అంతా భావించారు. అనుకున్నట్టుగానే నిర్ణయం వెలువడినా ఏ ఎన్నికలు ముందుగా నిర్వహిస్తారనేది కేబినెట్ సమావేశంలోనే తేల్చే అవకాశం ఉంది. ఎన్నికల సన్నద్ధతను సీఈవో కు తెలియజేస్తే రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ షెడ్యూల్ విడుదల చేస్తుంది. అయితే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయి. ఎంపీటీసీలను, జెడ్పీటీసీలను ఓటర్లు ఎన్నుకుంటారు.

# రేవంత్ చెప్పిన సిక్స్ ప్యాక్ ఫార్ములా



హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి తన ప్రత్యేకమైన మాటలతో యువతను ఆకట్టుకున్నారు. రాజకీయాల్లో "రాగ్స్ టు రిచెస్" కథను రాసుకున్న రేవంత్ రెడ్డి ఇప్పుడు యువతకు ఆరోగ్య సూత్రాన్ని చెప్పారు. అదీ మోడర్న్ జిమ్స్, ఫారిన్ డైట్ ఫుడ్ లాంటివి లేకుండా సంప్రదాయ సిక్స్ ప్యాక్ ఎలా తెచ్చుకోవాలో సీఎం సూచించారు. అదే వైరల్ అయ్యింది.తాజాగా రైతు సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి, యువతలో ఆరోగ్యంపై మారుతున్న దృక్కోణంపై అభిప్రాయం వ్యక్తం చేశారు. "ఇప్పుడు జనాలు ఆరోగ్యంగా ఉండేందుకు విదేశీ ఆహార పదార్థాలు, ముక్కు సూటి ఆకులు వంటివి తింటున్నారు. కానీ ఆరోగ్యానికి నిజమైన మార్గం మన పూర్వీకుల నుంచి వచ్చిన సంప్రదాయ ఆహారమే" అన్నారు."మన తెలంగాణ పూర్వీకులు ఇచ్చిన జొన్న రొట్టెలు తినండి. రోజూ స్వయంగా పనులు చేసుకోండి. బట్టలు ఉతుక్కోండి. అంతే, వర్కౌట్స్ అవసరం లేదు. ఆరోగ్యంగా ఉండొచ్చు, సిక్స్‌ప్యాక్ రావచ్చు కూడా. ఇదే నిజమైన పద్ధతి. శరీరం పండుతుందంటే లేబర్ చేయాలి. మన పనులు మనమే చేసుకోవాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.అంతేకాకుండా గత తరం ప్రజలు ఎంతో ఆరోగ్యంగా ఉండే వారని, ఎందుకంటే వాళ్ళు శుద్ధమైన ఆహారం తీసుకునేవారని చెప్పారు. ఆత్మనిర్భరత, శారీరక శ్రమతో కూడిన జీవనశైలి వాళ్ళు అనుసరించేవారని చెప్పారు. ఈ తరం యువత కూడా అదే దారిలో సాగాలని సూచించారు.ప్రస్తుతం రేవంత్ రెడ్డి చెప్పిన ఈ సిక్స్‌ప్యాక్ మంత్రం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆరోగ్యాన్ని సంపాదించుకోవడం అంటే జిమ్‌కెళ్లడం, ఫారెన్ సప్లిమెంట్స్ తినడం అనుకునే యువతకు ఇది మంచి అవగాహన కలిగించే సందేశంగా నిలుస్తోంది.

# టూరిజం ప్లాజా హోటల్‌ల్లో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు



హైదరాబాద్ : టూరిజం ప్లాజా హోటల్స్‌లో పరిశుభ్రత పాటించాలని, ఆహారం లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో మంగళవారం ఉదయం మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీలు చేశారు. రెస్టారెంట్‌లో ఆహార పదార్థాలు, కిచెన్‌ను పరిశీలిం చారు.అల్పాహారం చేస్తున్న పర్యాటకులు, అతిథిలతో మంత్రి జూపల్లి మాట్లాడారు. ఆహారం నాణ్యత, రుచి గురించి ఆరా తీశారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ.. హరిత హోటల్స్‌లో సౌకర్యాలు, ఆహార నాణ్యతపై నిరంతరం పరిశీలన కొనసాగిస్తామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యాటకులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత హోటల్స్ నిర్వాహకులపై ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆదాయం పెంచడంతో పాటు పర్యాటకులు, అతిథుల కోసం మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనపై ప్రదానంగా దృష్టి పెడుతున్నామని అన్నారు. ఆహ్లాదకరమైన వాతారణం ఉండేలా హరిత హోటల్స్ ను తీర్చిదిద్దుతామని చెప్పారు.

# రాబర్ట్ వాద్రాకు మరోసారి ఈడీ సమన్లు



వయనాడ్,వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాకు మరోసారి ఈడీ సమన్లు జారీ చేసింది. యూకేకు చెందిన ఆయుధాల వ్యాపారి సంజయ్ భండారీతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో ఈడీ సమన్లు జారీ చేసింది.ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ కింద వాంగ్మూలం నమోదు చేయడానికి బుధవారం ఈడీ ప్రధాన కార్యాలయానికి రావల్సిందిగా ఈడీ నోటీసులో పేర్కొంది.ఈనెల 10న విచారణకు హాజరుకావాలని ఈడీ నోటీసులు ఇచ్చింది. అయితే ఈ నెలాఖరులో విదేశీ పర్యటనకు ముందుగానీ.. తర్వాత గానీ హాజరవుతానని వాద్రా తెలిపారు. తన కుమార్తె గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొనడానికి విదేశాలకు వెళ్తున్నట్లు ఈడీకి తెలియజేశారు. ఇంకా ఎమర్జెన్సీగా హాజరు కావాలంటే వర్చువల్‌గా హాజరవుతారని న్యాయవాది సమాచారం అందించారు. మొత్తానికి ఆయా కారణాలు చెప్పి తప్పించుకున్నారు. తాజాగా మరోసారి అధికారులు నోటీసులు ఇచ్చారు. బుధవారం విచారణకు హాజరవుతారా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది.వాద్రా వాంగ్మూలం నమోదు చేసిన తర్వాత ఛార్జిషీట్ దాఖల చేయాలని ఈడీ భావిస్తోంది. ఇదిలా ఉంటే రాజకీయ ప్రయోజనాల కోసం తనను వేధిస్తున్నారని.. ఇబ్బంది పడుతున్నారని రాబర్ట్ వాద్రా ఆరోపిస్తున్నారు. వివిధ మనీలాండరింగ్ కేసుల్లో గతంలో మూడు రోజుల పాటు వాద్రాను ఈడీ అధికారులు విచారించారు.

# పశ్చిమాసియాలో మరింత ఉద్రిక్తత



వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హడావుడిగా స్వేదశం బయలుదేరి వెళ్లారు. కెనడా వేదికగా జరుగుతున్న జీ7 వేదికను వీడి అమెరికాకు తిరుగు ప్రయాణం కావడంతో.. సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. టెహ్రాన్ గగనతలాన్ని పూర్తిగా అధీనంలోకి తీసుకొన్నామని ఇజ్రాయెల్ ప్రకటించిన వేళ.. ఈ పరిణామాలు చోటుచేసుకొన్నాయి. ఆ నగరవాసులు నివాసాలు ఖాళీ చేసి వెళ్లిపోవాలని ట్రంప్ స్వయంగా హెచ్చరికలు జారీ చేయడం దీనికి ఆజ్యం పోసినట్లైంది. ట్రంప్ హడావుడిగా సిట్యుయేషన్ రూమ్‌ను సిద్ధం చేయించి.. వాషింగ్టన్‌కు తిరిగిరావడంతో.. అమెరికా కూడా ఇరాన్ అణుకేంద్రాలను ధ్వంసం చేయడంలో ఇజ్రాయెల్‌తో చేతులు కలపనుందనే ప్రచారం జోరందుకుంది. ఇందుకోసం దాదాపు 20 అడుగుల పొడవుండే జీబీయూ-57 అనే భారీ బంకర్ బస్టర్ బాంబును వాడాల్సి ఉంటుంది. ఇది సుమారు 13,600 కిలోల బరువు ఉంటుంది. దీనిని కేవలం అమెరికాకు తురుపు ముక్క అయిన బి-2 స్పిరిట్ బాంబర్లు మాత్రమే ప్రయోగించగలవు. కొన్ని నెలల క్రితమే ఈ రకానికి చెందిన దాదాపు 5 యుద్ధ విమానాలను పశ్చిమాసియా సమీపంలోని డియాగో గార్సియా బేస్‌కు చేర్చింది. దీనికితోడు రీఫ్యూయలింగ్ ట్యాంకర్లు, ఇతర యుద్ధ విమానాలు, ఆయుధాలను అమెరికా పశ్చిమాసియాకు తరలిస్తోంది. అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ నిమిట్జ్ కూడా ఇప్పటికే ఈ దిశగా బయల్దేరింది. ఓ పోర్టు విజిట్‌ను కూడా రద్దు చేసుకొని ఇది పశ్చిమాసియాకు ప్రయాణం కట్టడం గమనార్హం. దీంతోపాటు డెస్ట్రాయర్లు ఇతర సహాయక నౌకలు కూడా వస్తున్నాయి. బ్రిటన్ కూడా తన్న ÷టైర్‌జెట్లను మోహరిస్తోంది. అమెరికా కూడా ఇజ్రాయెల్‌తో కలిసి యుద్ధం చేస్తుందన్న ప్రచారంపై ప్రముఖ వ్యాఖ్యాత టకర్ కార్ల్‌సన్ ట్రంప్‌ను విమర్శించారు. దీనికి అమెరికా అధ్యక్షుడు తనదైనశైలిలో స్పందిస్తూ 'ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదు అన్న విషయాన్ని ఎవరైనా ఆ టకర్ కార్ల్‌సన్‌కు వివరించండి' అని వెటకారంగా చెప్పడం గమనార్హం. దీంతోపాటు సోషల్ మీడియా పోస్టులో కూడా ఇరాన్‌కు అణ్వాయుధం అందదు అని ట్రంప్ తేల్చిచెప్పారు. దీంతో ఆ దేశ అణు కేంద్రాలపై అమెరికా దాడి జరపొచ్చనే ప్రచారానికి బలం చేకూరుతోంది. మరోవైపు, ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గురించి ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ చేసిన వ్యాఖ్యలను ట్రంప్ ఖండించారు. 'నేను జీ7 సదస్సును ఎందుకు వీడుతున్నానో మేక్రాన్ తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను వాషింగ్టన్ ఎందుకు వెళ్తున్నానో ఆయనకు తెలియదు. కాల్పుల విరమణ ఒప్పందం గురించి కాదు.. అంతకంటే పెద్దదే జరగబోతోంది' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు. ఇకపోతే ఇరాన్‌లోని అణుకేంద్రాలు పెద్దగా దెబ్బతినలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ అధిపతి రఫాలే గ్రూసీ వెల్లడించారు. శుక్రవారం చేసిన దాడులు మినహా మిగిలినవి పెద్దగా వీటిపై ప్రభావం చూపలేదనే అభిప్రాయం వ్యక్తంచేశారు. నతాంజ్‌లోని భూగర్భ అణుశుద్ధి కేంద్రంపై పెద్దగా వీటి ప్రభావం లేదని పేర్కొన్నారు. విద్యుత్తు సరఫరా అంతరాయాలు వంటివి చోటుచేసుకొని మొత్తం 15,000 సెంట్రిఫ్యూజ్‌లు దెబ్బతిని ఉండొచ్చన్నారు. అంతేకానీ ఇవి ధ్వంసమై ఉంటాయని తాము అనుకోవటం లేదని వెల్లడించారు. నతాంజ్, ఫార్డో అణు కేంద్రాలు భూగర్భం లో లోతుగా నిర్మించారు. వీటిని పేల్చేయాలంటే అత్యంత భారీ శ్రేణికి చెందిన జీబీయూ-57 బంకర్ బస్టర్ బాంబులు అవసరం. అవి అమెరికా వద్ద మాత్రమే ఉన్నాయి. ఇరాన్‌లోని ఫార్డో అణుకేంద్రంలో యురేనియంను 60 శాతం శుద్ధి చేయగలరు. ఇది అణుబాంబులు తయారీ చేయడానికి అవసరమైన దానికి చాలా సమీపంలో ఉన్నట్లే లెక్క. 2023లో అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఈ కేంద్రంలో 83.7శాతం శుద్ధి చేసిన యురేనియంను గుర్తించింది. అణుబాంబుకు అవసరమైన 90 శాతానికి ఇది చాలా దగ్గరగా ఉంది. ఫార్డో కేంద్రాన్ని ఓ పర్వతం లోపల సొరంగాలు చేసి నిర్మించారు. ఇక్కడ 3,000 సెంట్రిఫ్యూజులు ఉన్నట్లు అంచనా. దీనిని సాధారణ బాంబులు ధ్వంసం చేయలేవు. ఇరాన్ నుంచి అణుబాంబు తయారీని దూరం చేయాలంటే దీనిని ధ్వంసం చేయడం అమెరికా, ఇజ్రాయెల్‌కు చాలా ముఖ్యం.

# పాఠాలు ఓకే.. ఆటలు ఎట్లా..?.. రెండేండ్లుగా పీడీ డిప్యూటేషన్



ఎల్లారెడ్డిపేట, జూన్ 17: పేద, మధ్యతరగతి వర్గాలకు కార్పొరేట్ స్థాయి విద్యనందించే లక్ష్యంతో మండల కేంద్రంలో నాటి ఐటీ పురపాలక శాఖ మంత్రి, ప్రస్తుత ఎంఎల్ఏ కేటీఆర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను సకల వసతులతో నిర్మింపజేశారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఉమ్మడి మండలాని చెందిన ఎందరికో విద్యనందించిన నిజాంకాలం నాటి పెద్దబడి కూల్చి వేత సందర్భంగా కేటీఆర్ ఓ అద్భుతమైన పాఠశాలను ఏర్పాటు చేస్తామని ఆనాటి నాయకులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అదే ఆర్కిటెక్చర్ తీరున మల్లీ నిజాం కాలంనాటి పెద్దబడి కొత్త సొబగులద్దుకుని సీఎస్ఆర్ నిధులతో రూ. 7.5కోట్లతో చేపట్టిన నూతన ఉన్నత పాఠశాల భవన నిర్మాణాన్ని గీవ్స్?? ఫౌండేషన్ కోఆర్డినేటర్ కొండూరి సాకేత్ పర్యవేక్షణలో సకల హంగులతో నూతన బడి నిర్మాణం పూర్తయింది.కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా 48 కంప్యూటర్లతో విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించేలా నిర్మించారు. 400 మంది ఒకేసారి బోజనం చేసేలా డైనింగ్ హాల్ కూడా ఏర్పాటు చేశారు. పెద్దబడిలో పాఠాలు చెప్పేందుకు ఓకే కానీ ఆటల కోసం పీడీ రాందాస్ రెండేండ్ల కింద డిస్ట్రిక్ యూత్ అండ్ స్పోర్ట్ ఆఫీసర్‌గా డిప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. దీంతో మోడల్ పాఠశాలలో విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచేందుకు, ఆటలపై శిక్షణ ఇచ్చేందుకు పీడీ లేక విద్యార్థుల శారీరక ఎదుగుదలకు ఆటంకం ఏర్పడుతున్నది. పాఠశాలలో చదువు ఓకే మరి ఆటల సంగతేంటని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు ఏడు తరగతుల విద్యార్థులకు ప్రతీ రోజు ఆటల కోసం ప్రత్యేక పీరియడ్ ఉండగా 8,9 తరగతి విద్యార్థులకు వారంలో రెండు రోజులు ఆటల కోసం ప్రత్యేక పీరియడ్స్?? ఉండగా సదరు పీరియడ్స్‌లో ఆటలు ఆడించే ఉపాధ్యాయుడు లేక విద్యార్థులు క్రమశిక్షణారాహిత్యంగా ప్రవర్తిస్తున్నట్లు కొందరు ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సంచలనం.. కేసీఆర్‌ని ఏపీ సర్కార్ అరెస్ట్ చేస్తుందా?




హైదరాబాద్,: తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనం రేపుతోందా? రేపో మాపో కీలక విషయాలు వెల్లడి కానున్నాయా? ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు ఫోన్‌ని తెలంగాణలో ట్యాపింగ్ చేశారా? ఈ విషయాన్ని అదుపులో ఉన్న నిందితులు అంగీకరించారా? అదే జరిగితే కేసీఆర్‌ని ఏపీ సర్కార్ అరెస్టు చేయడం ఖాయమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కొత్త కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బీఆర్ఎస్ హయాంలో కేవలం తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ నేతలు, న్యాయమూర్తులు, వ్యాపారవేత్తలు, సినిమావాళ్ల ఫోన్లు మాత్రమే కాదు.. ఏపీలో అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, లోకేష్, అచ్చెన్నాయుడు ఫోన్లను సైతం ట్యాపింగ్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి.చంద్రబాబు, లోకేష్‌లకు సన్నిహితంగా ఉండే మరో ముగ్గురు ఫోన్లు కూడా ఆ లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇది గనుక వాస్తవమయితే ఈ కేసు దేశ రాజకీయాల్లో పెను ప్రకంనాలు సృష్టించడం ఖాయం. ఈ మేరకు కొన్ని ఛానెళ్లలో ఈ తరహా వార్తలు జోరందుకున్నాయి.ఆయా ఫోన్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలోని ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్‌రావు ట్యాప్ చేసినట్టు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. నార్మల్ ఫోన్లు మాత్రమే కాకుండా వాట్సాప్ ఆడియోలను సైతం ట్యాప్ చేసినట్టు తెలుస్తోంది. ట్యాప్ చేసిన ఫోన్ల డేటాను ఓ చిప్‌లో పెట్టి ప్రభుత్వ పెద్దలకు అందజేసేవారట.అప్పటి ఏపీ సీఎం జగన్‌కు సన్నిహితంగా ఉండేవారు వచ్చి ఆ చిప్‌ని తీసుకెళ్లినట్టు బయటపడింది. దీని కోసం ఇంట్లో ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకుని జగన్ వినేవారని తెలుస్తోంది. ఒకవేళ ఫోన్ ట్యాప్ చేసింది వాస్తవమే అయితే బీఆర్ఎస్ కీలక నేతలకు కష్టాలు మొదలవ్వడం ఖాయమని అంటున్నారు.పై విషయాలు అధికారుల విచారణలో కొందరు అధికారులు చెప్పినట్టు ఓ వార్త హంగామా చేస్తోంది. కేసీఆర్ చెప్పినట్టుగా తాము చేశామన్నది వాళ్ల మాటగా తెలుస్తోంది. నార్మల్‌గా ఫోన్లు ట్యాపింగ్ చేయడం నేరం. అందులోనూ ఒక రాష్ట్ర ప్రతిపక్షనేత ఫోన్‌ని మరో రాష్ట్ర అధికార పార్టీ ట్యాపింగ్ చేయడం ఇంకా ఇంకా నేరం.దీనిపై క్లారిటీ వస్తే ట్యాపింగ్ కేసుని సీబీఐ హ్యాండిల్ చేసే అవకాశమున్నట్లు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై ఏపీ ప్రభుత్వం కేసు నమోదు చేసే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో అప్పటి తెలంగాణ ప్రభుత్వం పెద్దలను విచారణకు పిలిచే అవకాశముందని అంటున్నారు. అదే గనుక జరిగితే దేశవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించబోతోంది తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు.అంతేకాదు ఆ పార్టీని ప్రజలు శాశ్వతంగా దూరం పెట్టడం ఖాయమనే వాదన సైతం లేకపోలేదు. విచారణలో ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు చెప్పిన విషయాలు బయటకు వస్తే దుమారం రేగడం ఖాయం. రాజ్యాంగాన్ని అతిక్రమించి ఇలాంటి చర్యలకు పాల్పడడం క్షమించరాని నేరం కూడా. మొత్తానికి రేపటి రోజున ఫోన్ ట్యాపింగ్ గురించి ఇంకెన్ని కొత్త కొత్త విషయాలు బయటకు వస్తాయో చూడాలి.

# 33/11కేవీ సబ్ స్టేషన్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇవాళ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. జిల్లాలోని కొత్తపల్లి గోరి మండలం చెన్నాపూర్ లో ఏర్పాటు చేసిన 33/11కెవి సబ్ స్టేషన్ ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వరంగల్ ఎంపీ కడియం కావ్య,ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావుతో కలిసి స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు.అనంతరం సబ్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.

డిప్యూటీ సీఎంకు ఘన స్వాగతం..

పర్యటనలో భాగంగా జయశంకర్ జిల్లాకు చేరుకున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబుకు చెన్నాపూర్ గ్రామంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు,జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, జిల్లా అధికారులు పుష్ప గుచ్చం ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

2వేల వాహనాలతో భారీ బైక్ ర్యాలీ..

చెన్నాపూర్ సబ్ స్టేషన్ ప్రారంభం అనంతరం డిప్యూటీ సీఎం రోడ్డు మార్గం ద్వారా భూపాలపల్లికి బయలుదేరారు. భూపాలపల్లి మండలం మోరాంచపల్లికి చేరుకోగానే కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. సుమారు 2వేల ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీతో భూపాలపల్లి మంజూర్ నగర్ సభా స్థలానికి చేరుకున్నారు.

మూడు సబ్ స్టేషన్లకు శంకుస్థాపన

రూ. 2కోట్ల వ్యయంతో భూపాలపల్లి మండలం మంజూర్ నగర్, చిట్యాల మండలం నవాబుపేట, గణపురం మండలం ధర్మారావుపేటలో నిర్మించే మూడు సబ్ స్టేషన్ లకు మంజూర్ నగర్ వద్ద డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో వారు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ చైర్మన్ కర్నాటి వరుణ్ రెడ్డి , సింగరేణి అధికారులు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్చూర్ నాయక్, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కొమురయ్య, జిల్లా నాయకులు, పిప్పాల రాజేందర్, అప్పం కిషన్, దేవన్, దాట్ల శ్రీను, తోట సంతోష్, తోట రంజిత్, చరణ్, చుంచు మహేష్, కాంగ్రెస్, ఐఎన్టీ యూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇజ్రాయెల్ కు మద్దతు ప్రకటించిన జీ7 దేశాలు..

వాషింగ్టన్ డిసి : ఇరాన్ పై దాడికి దిగిన ఇజ్రాయెల్ కు జీ7 దేశాలు మద్దతు ప్రకటించాయి.. కెనడా లో జరిగిన జి 7 దేశాల సమావేశంలో ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించాయి.. అనంతరం ఈ దేశాలు ఒక సంయుక్త ప్రటనను విడుదల చేశాయి.. దాడులను వెంటనే ఇరాన్ విరమించుకోవాలని కోరాయి. ఇరాన్ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదని ఆ దేశాలు అభిప్రాయం వ్యక్తం

## సంపాదకీయం

బుధవారం 18-06-2025

# పసి మెదళ్లపై చదువుల ఒత్తిడి

తమ పిల్లలు ప్రపంచంతో పోటీపడాలని చాలామంది తల్లిదండ్రులు ఆరాటపడుతున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు, ర్యాంకులు తెచ్చుకోవాలని వారిపై ఒత్తిడి తెస్తున్నారు. పూర్వప్రాథమిక దశలోనే తమ బుజ్జాయిలు భాష, గణితాంశాలను నేర్చేసుకోవాలనే ఆత్రుత విపరీతంగా పెరిగిపోతోంది. అందుకే చాలామంది తల్లిదండ్రులు ప్రైవేట్, కార్పొరేట్ బడుల దగ్గర క్యూలు కడుతున్నారు.తమ పిల్లలు ప్రపంచంతో పోటీపడాలని చాలామంది తల్లిదండ్రులు ఆరాటపడుతున్నారు. పరీక్షల్లో మంచి మార్కులు, ర్యాంకులు తెచ్చుకోవాలని వారిపై ఒత్తిడి తెస్తున్నారు. పూర్వప్రాథమిక దశలోనే తమ బుజ్జాయిలు భాష, గణితాంశాలను నేర్చేసుకోవాలనే ఆత్రుత విపరీతంగా పెరిగిపోతోంది. అందుకే చాలామంది తల్లిదండ్రులు ప్రైవేట్, కార్పొరేట్ బడుల దగ్గర క్యూలు కడుతున్నారు. అవేమో ప్లేస్కూల్ స్థాయిలోనే వేలు, లక్షల రూపాయల ఫీజులు తీసుకుంటూ విద్యను వ్యాపారమయం చేస్తున్నాయి!విద్యార్థుల అభ్యసన సామర్థ్యం కుటుంబం, పరిసరాలు, పాఠశాల వాతావరణంపై ఆధారపడి ఉంటుంది. ఆ పరిస్థితుల ప్రభావంతోనే చిన్నారులు చదవడం, రాయడం, వినడం, చెప్పడం, లెక్కపెట్టడం వంటి నైపుణ్యాలు నేర్చుకోగలుగుతారు. విద్యా మనోవిజ్ఞాన శాస్త్రం ప్రకారం- పిల్లల అభ్యాసం ప్రధానంగా వారి శారీరక, మానసిక వికాసంపై ఆధారపడి ఉంటుంది. అదేమో వయసుతో ముడివడి ఉంటుంది. ఈ వికాసాన్ని బట్టే పిల్లలు క్రమంగా సరళమైన అంశాల నుంచి సంక్లిష్టమైన విషయాలను అర్థం చేసుకోగలుగుతారు. అందుకే శిక్షణలో ఉన్న ఉపాధ్యాయులకు విద్యా మనోవిజ్ఞాన శాస్త్రాన్ని ప్రత్యేక సబ్జెక్టుగా బోధిస్తారు.కొంతకాలంగా విద్యారంగంలో పోటీతత్వం పెరుగుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలు మూడో ఏట అడుగుపెట్టగానే బడికి పంపుతున్నారు. ఇది పాఠశాల వాతావరణానికి అలవాటుపడే దశ మాత్రమే. కానీ, ఈ వయసులోనే పిల్లలు అన్నీ నేర్చేసుకోవాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ఇది చిన్నారుల మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల మూడు, ఆరేళ్ల పిల్లల చేతివేళ్ల ఎక్స్‌రే చిత్రమొకటి సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. దాన్ని చూపెడుతూ మూడేళ్ల పిల్లల చేతులు రాయడానికి సిద్ధంగా ఉండవనీ, ఆరేళ్ల తరవాతే అవి రాయగలుగుతాయని వైద్య నిపుణులు వివరించారు. మూడేళ్ల బాలబాలికల్లో రాయడానికి వీలైనంత పటిష్ఠంగా ఎముకలు తయారై ఉండవు కాబట్టి, బలవంతంగా వారితో రాయించడం ఏమాత్రం సరైనది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

వయసే ప్రమాణం...

జాతీయ విద్యావిధానం-2020 ద్వారా, ప్రస్తుత చదువుల(10ం2) స్థానంలో 5ం3ం3ం4 విధానాన్ని తీసుకొచ్చారు. ఇందులో మొదటి అయిదేళ్లను సన్నాహక దశగా పేర్కొంటారు. ఈ దశలో పిల్లలకు బొమ్మలతో బోధించి, కథలు చెబుతారు. పిల్లలు ఆడుకోవడం, వస్తువుల అమరిక ద్వారా భాష, గణిత నైపుణ్యాలకు సంబంధించిన పూర్వజ్ఞానాన్ని ఆర్జిస్తారు. కాబట్టి, వీటికి సంబంధించిన కృత్యాలను జట్టుగా, వ్యక్తిగతంగా పిల్లలతో చేయించడం ముఖ్యం. అప్పుడే వారిలో జ్ఞానేంద్రియాల సమన్వయం జరిగి అభ్యసనం ఆరంభమవుతుంది. పైగా వారిలో బెరుకు స్వభావం తొలగిపోయి... తార్కిక జ్ఞానం, సృజనాత్మకత పెరుగుతాయి. కేంద్ర విద్యాశాఖ గతేడాది పిల్లలను ఆరు సంవత్సరాలు నిండిన తరవాతే ఒకటో తరగతిలో చేర్చుకోవాలని అన్ని రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆదేశాలు జారీ చేసింది. ఇదే విషయాన్ని జాతీయ విద్యావిధానం నొక్కి చెబుతూ- బడిలో చేరికకు దేశమంతటా ఒకే వయసు విధానం ఉండాలని సిఫార్సు చేసింది. గతేడాది నుంచి సీబీఎస్‌సీ, ఐసీఎస్‌సీ బోర్డులకు అనుబంధంగా ఉన్న పాఠశాలలు ఒకటో తరగతి ప్రవేశానికి ఆరేళ్ల వయసు ప్రమాణాన్ని అనుసరిస్తున్నాయి. కేరళ రాష్ట్రంలోనూ ఒకటో తరగతిలో ప్రవేశానికి అయిదు నుంచి ఆరేళ్లకు వయసును సడలించారు. కర్ణాటకలో ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు. చాలా రాష్ట్రాలు ఈ వయసు నిబంధనను పాటించడంపై స్పష్టతనివ్వడం లేదు.

తల్లిదండ్రుల్లో గందరగోళం

ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి అయిదేళ్ల నిబంధనే కొనసాగుతోంది. దాంతో తల్లిదండ్రుల్లో కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ విషయంలో అన్ని రాష్ట్రాలూ ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంది. విద్యాహక్కు(ఆర్టీఈ) చట్టం, ఒకటో తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థికి అయిదేళ్లు నిండి ఉండాలని చెబుతోంది. నూతన విద్యా విధానమేమో ఆరేళ్లు నిండినవారినే చేర్చుకోవాలంటోంది. కాబట్టి, ఆర్టీఈలో ఒకటో తరగతిలో ప్రవేశానికి అర్హమైన వయసును సవరించాలి. తమ పిల్లలు చిరు ప్రాయంలోనే అద్భుతాలు సాధించాలని చాలామంది తల్లిదండ్రులు కలలు కంటున్నారు. దానివల్ల విద్యార్థులపై తెలియకుండానే ఒత్తిడి పెరుగుతోంది. ఏళ్లు గడిచేకొద్దీ ఆ ఒత్తిడికి తాళలేక వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రులు, విద్యాసంస్థలు మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తీసుకురాకూడదు. వారిలో సహజ నైపుణ్యాలను వెలికితీయడానికి ప్రాధాన్యమివ్వాలి. తరగతిలో చేర్చుకునేటప్పుడు వయసు ప్రమాణాన్ని విద్యాసంస్థలు కచ్చితంగా పాటించాలి. విద్యార్థి కేంద్రీకృత అభ్యసనానికి ప్రాధాన్యమివ్వడం అత్యంత కీలకం. ఆటపాటలతో కూడిన బోధనా విధానాన్ని అనుసరించాలి. దానివల్ల ప్రాథమిక విద్యాభావనలైన చదవడం, రాయడం, లెక్కించడం వంటివి చిట్టి బుర్రల్లో సరిగ్గా నాటుకుంటాయి. భావి చదువులకు అవే గట్టి పునాదులు అవుతాయి.

# పవనశక్తిని ఒడిసిపట్టాలి



న్యూఢిల్లీ,ప్రపంచ పవన శక్తి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏట 15 జూన్ రోజున ప్రపంచ పవన దినం లేదా వరల్డ్/గ్లోబల్ విండ్ డే నిర్వహిస్తూ యువత, పౌర సమాజానికి పర్యావరణ హితమైన పవన శక్తి ప్రాధాన్యాలను, దాని ప్రయోజనాలను వివరించుట జరుగుతుంది. సంప్రదాయేతర తరగని పునరుత్పత్తి చేయగల శక్తి వనరుల్లో సౌరశక్తి తర్వాత రెండవ ప్రధానమైనదిగా పవన శక్తికి గుర్తింపు ఉన్నది. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూ, పర్యావరణహిత శక్తిని ఉత్పత్తి చేయడానికి దేశవ్యాప్తంగా సహజంగా వీస్తున్న పవనాల్లో దాగిన అపార శక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చడానికి ట్బన్లను వినియోగిస్తారు. ఈ ట్బన్లు గవీస్తున్న గాలిలో దాగిన గతిశక్తిని యాంత్రిక శక్తిగా మార్చడం, తర్వాత విద్యుచ్ఛక్తిగా మార్చడం జరుగుతోంది. ఆన్షోర్, ఆఫ్షోర్ పవన శక్తులను ఒడిసిపట్టి, ఆరోగ్యకర పనరుత్పత్తి శక్తిని ఉత్పత్తినచేయడం నేటి కనీస అవసరంగా మారుతోంది.ప్రపంచ దేశాల్లో చైనా, యూఎస్, జర్మనీ, భారత్ లాంటి దేశాలు పవన శక్తి వినియోగంలో ముందున్నాయి. యూరోప్లో వినియోగిస్తున్న మొత్తం శక్తిలో 20 శాతం పవన శక్తి ఉండడం హర్షదాయకం. తీరప్రాంతాలు, గాలి వీచే మైదాన ప్రాంతాలు అధికంగా ఉన్న భారత్ నాలుగవ అతి పెద్ద పవన శక్తి ఉత్పత్తి చేస్తున్న భారతంలో గుజరాత్, తమిళ నాడు, కర్నాటక, రాజస్థాన్ రాష్ట్రాలు పవన శక్తి పరిశ్రమలో ముందు ఉన్నాయి. తెలంగాణలో దాదాపు 130 మెగావాట్లకు పైగా పవనశక్తి ఉత్పత్తి కావడం, రానున్న రోజుల్లో మరింత పెంచే ప్రయత్నాలు చేయడం జరుగుతోంది. దేశ పవన శక్తిలో 40 శాతం వరకు తమిళ నాడు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నది. 2025 తొలి త్రైమాసికంలో 50,000 మెగావాట్ల పవనశక్తి ఉత్పత్తికి నిర్మాణాలు జరిగాయి. కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడానికి ప్రత్యామ్నాయంగా పునరుత్పత్తి పవన శక్తిని ఒడిసిపట్టడం మన తక్షణ కర్తవ్యం అని భావించాలి.ప్రపంచ పవన దినోత్సవ వేదికగా (%ఖుఅఎ్ఖ్టుజుఖుఖు ఋఎ ఖీవర్అఋఖుశ్రీ ఎవఅబవ%) పవన శక్తి పట్ల అవగాహన, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక ప్రగతికి దోహదపడడం, పవనాల నుంచి చవకైన విద్యుచ్ఛక్తిని తయారు చేయడం, పవన శక్తి వినియోగం పట్ల ప్రభుత్వ పాలసీలు రచించడం/అమలు చేయడం జరుగుతుంది. నేడు ప్రపంచవ్యాప్తంగా పవనశక్తి రంగంలో 3.7 లక్షల ఉద్యోగులు పని చేస్తుండగా, 2030 నాటికి వీరి సంఖ్య 6 లక్షలకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. పవనశ క్తి ఉత్పత్తిని క్రమంగా పెంచడానికి పలు దేశాలు కార్యాచరణను సిద్ధం చే యడం, అధిక ప్రాధాన్యం ఇవ్వడం కొనసాగుతున్నది. గృహాల్లో వెలుగు లు నింపడం, పరిశ్రమల్లో యంత్రా లు కదలడానికి పవనశక్తిని వినియోగిస్తున్నాం. కొండలు, పర్వతాలు, స ముద్రాలు, తీరప్రాంతాల్లో పవనశక్తిని ఒడిసిపట్ట వచ్చని గమనించాలి.పవనశక్తి ప్రాధాన్యాన్ని గుర్తించి, ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తూ, సుస్థిరాభివృద్ధికి ఊతం ఇవ్వాలి. నేడు ప్రపంచాన్ని కుదిపేస్తున్న వాతావరణ ప్రతికూల మార్పులను కట్టడి చేయడానికి తరగని శక్తి వనరులను ఆశ్రయించాల్సిందే. పవనశక్తి ఉత్పత్తికి అనుకూలంగా ఉన్న భారతం రానున్న రోజుల్లో పవనశక్తి ఉత్పత్తిని పెంచుతూ ప్రపంచ పవనశక్తి దేశంగా పేరు తెచ్చుకోవాలి, పర్యావరణాన్ని పరిరక్షిణచుకోవాలి. భవిష్యత్తు శక్తి భద్రతలో పవనశక్తి పాత్ర విశిష్టమైనదని తెలుసుకోవాలి. మెయింటెనెన్స్ ఖర్చులు అతి తక్కువగా ఉన్న పవనశక్తి రంగం రానున్న రోజుల్లో మన దేశంలో మరింత పుంజుకోవాలని కోరుకుందాం

# గద్దర్ ఫిల్మ్ అవార్డు ఫంక్షన్‌లో తెలంగాణ సోయి ఏది?

హైదరాబాద్, తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ కార్యక్రమం అనేది తెలంగాణ రాష్ట్ర సినిమా కళాకారుల కార్యక్రమం. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తరువాత తొలిసారి జరిగిన సినిమా మహోత్సవం ఇది. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రాంత కళాకారులు హాజరుకావడాన్ని, అవార్డులు స్వీకరించడాన్ని ఎవరూ తప్పు పట్టడం లేదు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్ర కళాకారులను ఆకాశానికి ఎత్తినందుకు ఎవరూ వేలెత్తి చూపడం లేదు కానీ, తెలంగాణ మట్టిపై పుట్టి జాతీయ, అంతర్జాతీయ కళాకారులుగా పేరొందిన వారి పేర్లను స్మరించకుండా విస్మరించడంపై కళామతల్లి ముద్దుబిడ్డల గుండెలను పిండేస్తున్నది. రేవంత్ రెడ్డి ఆ పేర్లను మర్చిపోయారా? లేక ఆయనకు ఆ స్పీచ్ రాసిచ్చినవారికి ఆ సోయి లేదా? అని తెలంగాణ కవులు, కళాకారులు చర్చించుకుంటున్నారు. మాదాపూర్ హైటెక్స్‌లో శనివారం రాత్రి తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్సు 2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథి హాజరు కాగా, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డితో పాటు సినిమా రంగానికి చెందిన పలువురు ప్రముఖ నటులు, దర్శకులు, నిర్మాతలు హాజరయ్యారు. వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులను బహూకరించారు. ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు, రఘుపతి వెంకయ్య పురస్కారం, బీఎన్.రెడ్డి పురస్కారం, నాగిరెడ్డి చక్రపాణి ఫిల్మ్ అవార్డు, కాంతారావు, పైడి జయరాజ్ అవార్డులతో పాటు ఉత్తమ నటుడు, ఉత్తమ నటి సహా వివిధ క్యాటగిరీల్లో పురస్కారాలను కూడా ప్రదానం చేశారు. ఇందులో కాంతారావు ఫిల్మ్ అవార్డు, పైడి జైరాజ్ అవార్డులు పూర్తిగా తెలంగాణ కళాకారుల పేర్లతో ఉన్నవి. మిగతా ప్రత్యేక అవార్డులు మొత్తం ఆంధ్రా ప్రాంతానికి చెందినవని తెలంగాణ ప్రాంత సినీ కళాకారులు చెబుతున్నారు. అన్నింటికి మించి ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. సినిమా పరిశ్రమలో తొలి తరం అంటే ఎన్టీఆర్, ఏఎన్నాఆర్, రెండో తరంలో ఘట్టమనేని కృష్ణ, శోభన్ బాబు, కృష్ణంరాజు, మూడో తరంలో కొణిదెల చిరంజీవి, నందమూరి బాలకృష్ణ, దగ్గుబాటి వెంకటేష్, అక్కినేని నాగార్జున వంటి హీరోలు ఉన్నారన్న రేవంత్‌రెడ్డి.. ప్రస్తుతం నాలుగో తరంలో కొణిదెల పవన్ కళ్యాణ్, ఘట్టమనేని మహేష్ బాబు, అల్లు అర్జున్ ఉన్నారని గుర్తు చేశారు. డైరెక్టర్ రాజమౌళి ప్రపంచం గుర్తించేలా సినిమాలను తీస్తున్నారు కాని హాలీవుడ్, బాలీవుడ్‌ను తెలంగాణ గడ్డకు తీసుకురావడం లేదని చెబుతూ.. వారు కూడా ఇక్కడకు రావాలంటే అందుకోసం మీకేమి కావాలో చెబితే ఆ దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంతటి ప్రసంగంలోనూ ముఖ్యమంత్రి ఎక్కడా తెలంగాణ సోయి ఉన్నట్టు మాట్లాడకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తెలంగాణ మట్టిగడ్డపై పుట్టి చెన్నై, హైదరాబాద్, ముంబైలలో సినిమా రంగానికి సేవ చేసి, ప్రఖ్యాతి పొందిన కళాకారుల పేర్లను ప్రస్తావించకపోవడం తెలంగాణ సమాజం జీర్ణించుకోలేకపోతున్నది.

తెలంగాణ కళాకారులకు గౌరవమేది?

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత తెలంగాణ సమగ్ర సాంస్కృతిక విధానం రూపొందించే ఆలోచనతో.. ప్రముఖ దర్శకుడు, మెతుకుసీమ వాసి, రచయిత బీ నరసింగరావుతో సాంస్కృతిక పాలసీని తయారు చేయించారు. పాలసీలో ప్రస్తావించిన అంశాల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా రేవంత్ రెడ్డి తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్సులో ప్రస్తావించలేదంటున్నారు తెలంగాణ ప్రాంత సినీ కళాకారులు.

దేశ విదేశాల్లో ఖ్యాతిగాంచిన శ్యాంబెనెగల్

ఈ గడ్డపై పుట్టి దేశ, విదేశాలలో పేరు ప్రఖ్యాతులు పొందిన వారిలో భారతీయ సినిమా దర్శకుడు, దాదా సాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత, పద్మశ్రీ శ్యాం బెనెగల్ 1934 సంవత్సరంలో హైదరాబాద్ నగరం తిరుమలగిరిలో జన్మించారు. ఆయన పూర్తి పేరు శ్యాం సుందర్ బెనగల్. సికిందరాబాద్ ప్యాట్నీ సెంటర్ లోని మహబూబ్ కాలేజీలో డిగ్రీ వరకు చదువుకుని, ఆ తరువాత ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో మాస్టర్ పట్టా అందుకున్నారు. ఆయన సినిమా రంగానికి చేసిన కృషిని భారత ప్రభుత్వం గుర్తించింది కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించ లేదని ఈ ప్రాంత కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలీవుడ్ హీరో పైడి జైరాజ్

సిరిసిల్లలో అచ్యుతయ్య నాయుడు, తాయారమ్మ దంపతులకు జన్మించిన పైడి జైరాజ్ హిందీ చిత్ర పరిశ్రమలో గొప్ప నటుడిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. భారతీయ చలన చిత్ర రంగానికి ఆయన చేసిన సేవలకు గాను 1980లోనే దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. 156 చిత్రాలో కథానాయకుడి పాత్రలతో పాటు మొత్తం 300కు పైగా మూకీ, టాకీ సినిమాలలో నటించారు. నిజాం కాలేజీలో చదువుకున్న జైరాజ్ సినిమాలపై మోజుతో 1929లోనే ముంబై చేరుకుని, శాంతారాం, పృథ్వీరాజ్ కపూర్ స్థాయిలో పేరు



తెచ్చుకున్నారు. నిరూపా రాయ్, శశికళ, దేవికారాణి, మీనాకుమారి వంటి నటీమణుల సరసన నటించి మెప్పించారు. హిందీలోనే కాకుండా మరాఠా, ఒడియా, బెంగాలీ, పంజాబీ, కొంకణి, గుజరాతీ, మలయాళం భాషల్లో నటించి, తెలంగాణ నేల నుంచి దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదిగారు.

సినీ కళామతల్లికి సిందూరం కాంతారావు

తాడేపల్లి లక్ష్మీకాంతారావు 1923 సంవత్సరం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండ గ్రామంలో జన్మించి, అనేక సాంఘిక, పౌరాణిక, జానపద పాత్రలు చేశారు. మొత్తం 400కు పైగా సినిమాలలో నటించిన ఈయన నిర్దోషి చిత్రం ద్వారా సినిమాల్లోకి ప్రవేశించారు. దర్శకులు దాసరి నారాయణ రావు మాటల్లో చెప్పాలంటే తెలుగు చలనచిత్ర సీమకు ఎన్టీఆర్, ఏఎన్నాఆర్ రెండు కళ్లు అయితే వాటి మధ్య నుదుటిపై తిలకం కాంతారావు.

పేద కళాకారుల కోసం తపించిన ప్రభాకర్‌రెడ్డి

తెలుగు సినిమా పరిశ్రమను చెన్నై నుంచి 1990 మొదట్లో హైదరాబాద్ కు తీసుకురావడంలో సినిమా నటుడు, రచయిత, వైద్యుడు మందాడి ప్రభాకర్ రెడ్డి పాత్ర చెరిపేయలేనిది. పేద సినిమా కళాకారుల కోసం చిత్రపురిలో తన 10 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలో లక్ష్మారెడ్డి, కౌసల్య దంపతులకు 1935లో ప్రభాకర్ రెడ్డి జన్మించారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసి 1960 లో చివరకు మిగిలేది సినిమాతో చిత్రరంగంలోకి ప్రవేశించారు. ఆయన తన 37 సంవత్సరాల సినిమా కేరీర్ లో 472 సినిమాలలో నటించి ప్రేక్షకులను మెప్పించారు.

విలక్షణ దర్శకుడు నరసింగరావు

ప్రపంచ చలనచిత్ర పటంపై తెలంగాణ సినిమాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన దర్శకులు, రచయిత బొంగు నరసింగరావు. సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ గ్రామంలో 1946లో జన్మించిన ఆయన రంగుల కల, దాసి, మట్టి మనుషులు నిర్మాణం చేసి తెలంగాణ జీవన చిత్రాలనే తన సినిమాలుగా రూపొందించిన గొప్ప కళాకారుడు. మా భూమి సినిమాను 1979లోనే కైరో, సిడ్నీ ఫిల్మ్ ఫెస్టివల్, కార్లోవీ ఫిల్మ్ ఫెస్టివల్ లో ప్రదర్శింపచేయించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. నరసింగరావు తీసిన ప్రతి సినిమా తెలంగాణ సినిమాకు ఒక గ్రామర్, బలమైన పునాదిని సృష్టించిందని ఇప్పటికీ చెప్పుకొంటారు. మట్టి మనుషులు మాస్కో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ లో మెరిట్ అవార్డు డిప్లొమా, మా ఊరు హంగేరిలో అంతర్జాతీయ ఉత్సవంలో మీడియా వేవ్ అవార్డును గెలుపొందింది.

క్లార్క్ గేబుల్ ఆఫ్ ఇండియా అజిత్

బాలీవుడ్‌లో క్లార్క్ గేబుల్ ను తలపించే అజిత్‌ఖాన్.. మన హైదరాబాద్ బిడ్డే. హిందీ సినిమారంగంలో దాదాపు నాలుగు దశాబ్దాలపాటు రెండు వందలకు పైగా సినిమాల్లో నటించాడు. గోల్కొండ కోట సమీపంలోని దక్కనీ ముస్లిం కుటుంబంలో హమీద్ అలీ ఖాన్‌గా జన్మించిన అజిత్.. పాఠశాల వయసులోనే సినిమా హీరోగా తోటి విద్యార్థులు ప్రశంసించేవారు. డబ్బులు లేకపోవడంతో పాఠ్యపుస్తకాలను అమ్మేసి, తల్లిదండ్రులకు చెప్పకుండా ముంబై వెళ్ళాడు. 1940ల్లో అదృష్టం అతనికి అనుకూలించలేదు. మొదట్లో చిన్నాచితక క్యారెక్టర్లు వేశాడు. 1946లో తొలిసారిగా షాహే మిశ్రా సినిమాలో గీతా బోస్ పక్కన నటించాడు. ఆ తర్వాత ప్రధాన నటుడిగా స్థిరపడ్డాడు. నానా భాయ్ భట్ సలహా మేరకు “అజిత్” అనే పేరును తన స్క్రీన్-నేమ్‌గా పెట్టుకున్నాడని చెబుతారు. టీ కృష్ణ, శంకర్ జైకిషన్ జంటలో శంకర్, విలనిజానికి తొలి ప్రతినిధి ఆర్ నాగేశ్వర్‌రావు, త్యాగరాజు ఇలా ఎందరో ఆయా తరాల్లో తెలుగు సినీ తెరను కళకళలాడించారు. అనేక మంది సాంకేతిక నిపుణులు తమ సత్తా చాటుకున్నారు. వీరందరినీ విస్మరించడం మనల్ని మనం అవమానపర్చుకోవడమేనని తెలంగాణ సినీ కళాకారులు చెబుతున్నారు.

తెలంగాణ పాలసీ ఏది?

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం తరువాత బీఆర్ఎస్ పాలనలో సమగ్ర సాంస్కృతిక విధానాన్ని రూపొందించడంలో విఫలమైంది. అవార్డులను బహూకరించేందుకు పాలసీ రూపొందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శించింది.

# పబ్‌లపై ఎస్‌వోటీ పోలీసుల దాడులు

హైదరాబాద్, తెలంగాణను డ్రగ్ రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా పోలీసులు మెరుపుదాడులు చేస్తున్నారు. తాజాగా కోకాపేట్‌లోని పబ్‌లో అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టారు ఎస్వోటీ పోలీసులు. డ్రగ్స్, గంజాయి వాడుతున్నట్లు సమాచారంతో ఎస్ఓటీ, నార్సింగి పోలీసులు సంయుక్తంగా పబ్‌లలో దాడులు నిర్వహించారు. కోకాపేటలోని రాబిట్ హౌల్, మై క్యాప్స్, గండిపేటలోని టస్కా పబ్‌లలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో అనుమానితులకు డ్రగ్స్ డిటెక్షన్ పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇద్దరికి గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. దీంతో నార్సింగ్ పోలీసులు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల గచ్చిబౌలిలోని పలు పబ్బులపై కూడా ఎస్ఓటీ పోలీసులు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఎస్ఎల్ఎన్ టెర్మినల్ మాల్‌లోని పబ్బుల్లో డ్రగ్స్ తనిఖీలు నిర్వహించారు. క్లబ్ రోగ్, ఫ్రాట్ హౌస్ పబ్‌లో దాడులు జరిపిన ఎస్వోటీ పోలీసులు.. డ్రగ్స్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ క్రమంలో మొత్తం నలుగురికి గంజాయి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. గంజాయి పాజిటివ్ వచ్చిన వారిలో ఫ్రాట్ హౌస్ పబ్ డీజే ప్లేయర్ శివ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే మాదాపూర్, కొండాపూర్‌లో పలు పబ్‌లపై జరిపిన దాడుల్లోనూ డ్రగ్స్ టెస్టులు నిర్వహించగా.. ఇద్దరికి గంజాయి పాజిటివ్ అని తేలింది. మాదాపూర్ అఖాన్ పబ్‌లో ఒకరికి, కొండాపూర్ ఏ19 పబ్‌లో మరొకరికి గంజాయ్ పాజిటివ్ అని తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక.. తెలంగాణను డ్రగ్స్ భూతం పట్టిపీడిస్తోంది. డ్రగ్స్‌తో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ యువత మాత్రం డ్రగ్స్ బారి నుంచి బయటకురాని పరిస్థితి. డ్రగ్స్ ఊబిలో చిక్కుకుని విలువైన జీవితాన్ని, భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేస్తోంది యువత. మరోవైపు విద్యార్థులు, యువతే లక్ష్యంగా డ్రగ్స్ మాఫియా ఈ దందాను నిర్వహిస్తోంది. సామాన్యుల నుంచి సెలబ్రెటీల వరకు కూడా డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడుతున్న సందర్భాలు ఎన్నో. సెలబ్రెటీలను కూడా వదలకుండా పోలీసులు పట్టుకుంటున్నారు. అంతేకాకుండా రెస్టారెంట్లు, పబ్‌లు, హెటల్స్‌లలో తరచూ దాడులు చేస్తూ డ్రగ్స్ మాఫియా ఆగడాలను అరికట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కడో చోట డ్రగ్స్, గంజాయి సరఫరా కొనసాగుతూనే ఉంది.

# విచారణ చేపట్టిన అధికారులు

హైదరాబాద్,జర్మనీ నుంచి హైదరాబాద్ వస్తున్న లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. లుఫ్తాన్సా ఎల్‌హెచ్ 752 విమానానికి ఈ బెదిరింపు కాల్ రావడంతో శంషాబాద్ విమానాశ్రయంలో ఫ్లైట్ ల్యాండ్ చేయలేదు. విమానం తిరిగి జర్మ నీకి ప్రయాణమైంది. కాగా శంషాబాద్ ఎయిర్ పోర్టుకు రావాల్సిన విమానం తిరిగి ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయానికి వెళ్లింది. దీంతో జర్మనీ పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ సాగిస్తున్నారు. జర్మనీ నుంచి బయలుదేరిన విమానం దాదాపు 8, 9 గంటల తర్వాత శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోవాల్సి ఉంది. విమానంలో ఎక్కువ మంది హైదరాబాద్‌కు చెందిన ప్రయాణీకులు ఉన్నారు. అలాగే ముంబైకు చెందిన వారు కూడా ఉన్నారు. అయితే బాంబు బెదిరింపు కారణంతో లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానానం తిరిగి ఫ్రాంక్‌ఫర్ట్‌కు వెళ్లింది. అక్కడ ఎయిర్ పోర్టు అధికారులు పరిశీలించిన తర్వాత బాంబు లేదని తేల్చారు. అదొక ఫేక్ కాల్‌గా గుర్తించారు. అయినా మరో 2, 3 గంటలు విమానాన్ని పూర్తిగా తనిఖీలు చేసిన తర్వాత బయలుదేరే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విమానాశ్రయంలోనే ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. జర్మనీ నుంచి బయలుదేరిన సుమారు రెండు గంటల ప్రయాణం అనంతరం విమానానికి బాంబు బెదిరింపు కాల్ రావడంతో ఫ్లైట్ తిరిగి ఫ్లైట్‌ను ఫ్రాంక్‌ఫర్ట్‌కు మళ్లించారు. అనంతరం అధికారులు విమానాన్ని ఆధీనంలోకి తీసుకొని భద్రత చర్యలు చేపట్టారు. ఎల్‌హెచ్ 752 విమానం జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టు నుంచి అక్కడి కాలమానం ప్రకారం ఆదివారం మధ్యాహ్నం 2.14 గంటలకు బయలుదేరింది. షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆదివారం అర్ధరాత్రి దాటాక చేరుకోవాల్సి ఉంది. అయితే బాంబు బెదిరింపు కారణంగా విమానాన్ని వెనక్కి మళ్లించారు. హైదరాబాద్‌లో విమానం ల్యాండింగ్‌కు అనుమతి రాకపోవడంతోనే ఫ్లైట్‌ను వెనక్కి మళ్లించినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రయాణికులకు విమానాశ్రయంలోనే వసతి కల్పించినట్లు తెలియవచ్చింది.

# రీయూనియన్ మొదలైనట్టే!

హైదరాబాద్,తెలుగు దేశం పార్టీతెలుగు ప్రజల ఆత్మ గౌరవ పరిరక్షణే పరమావధిగా ఏర్పాటైన పార్టీ. 40 ఏళ్లకు పైగా ప్రస్థానం సాగిస్తున్న టీడీపీ అన్ని సమయాల్లో కంటే ఇప్పుడు అత్యంత బలీయంగా ఉందని చెప్పాలి. జనసేన, బీజేపీలతో జత కట్టిన టీడీపీ%ా% ఏపీ అసెంబ్లీని దాదాపుగా క్లీన్ స్వీప్ చేసినంత పనిచేసింది. తిరుగులేని విజయాన్ని నమోదు చేసిన టీడీపీ.. అటు కేంద్రంలోని ఎన్డీఏలో కీలక భాగస్వామిగా కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ ఆవిర్భవించిన తెలంగాణలో తిరిగి పార్టీకి పూర్వవైభవం కల్పించే దిశగా పార్టీ అదినేత, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు చర్యలు ప్రారంబించేశారు.గత కొంతకాలం క్రితమే చంద్రబాబు ప్రారంభించిన ఈ చర్యలు క్రమంగా సఫలం అవుతున్నాయి. గతంలో టీడీపీలో కీలక నేతగా పనిచేసిన నల్లగొండ కీలక రాజకీయవేత్త, కేంద్ర మాజీ మంత్రి గుత్తా సుఖేందర్ రెడ్డి శనివారం హైదరాబాద్ లో చంద్రబాబుతో బేటీ అయ్యారు. ఏపీ సీఎంగా బిజీబిజీగా ఉంటున్న చంద్రబాబు%ా% వీకెండ్స్ లో ఫ్యామిలీతో గడిపేందుకు హైదరాబాద్ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే శనివారం హైదరాబాద్ చేరిన బాబుతో గుత్తా భేటీ అయ్యారు. వీరి భేటీలో ఏపీ అంశాలు చర్చకు వచ్చాయన్న విషయాన్ని పక్కనపెడితే%ా% టీ టీడీపీ రీయూనియన్ దిశగా పకడ్బందీగానే అడుగులు పడుతున్నాయని చెప్పక తప్పదు.ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ చాలా వీక్ గా ఉంది. పదేళ్ల పాటు తెలంగాణ ప్రజలు ఇచ్చిన అదికారాన్ని దుర్వినియోగం చేసిందంటూ ఇంటా బయటా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో బీఆర్ఎస్ పాలనలో జరిగిన కీలక పరిణామాలపై వరుసగా కేసులు నమోదు అవుతున్నాయి. కేసీఆర్ సహా బీఆర్ఎస్ కు చెందిన చాలా మంది నేతలు ఈ విచారణలు, కేసుల్లో ఇరుక్కుని నానా అవస్థలు పడుతున్నారు. ఇక అధికారంలో ఉన్న కాంగ్రెస్%ా% అంతగా బలంగా లేదనే చెప్పాలి. అదికారం ఉంది కదా అన్న ధీమా తప్పించి వచ్చే ఎన్నికల్లో గెలిచి తీరతారమన్న నమ్మకం అయితే ఆ పార్టీ నేతల్లో పెద్దగా కనిపించడం లేదు.ఇదిలా ఉంటే ఇప్పుడున్న కాంగ్రెస్ కేబినెట్ లో సీఎం రేవంత్ రెడ్డితో సహా ఇద్దరు కీలక మంత్రులు టీడీపీ నుంచి వచ్చిన వారే. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క టీడీపీ నుంచి కాంగ్రెస్ లోకి వచ్చిన నేతలే. రాష్ట్ర విభజన నేపథ్యంలో వీరు పార్టీ మారక తప్పలేదు. ఇక ప్రభుత్వ సలహాదారుగా ఉన్న వేం నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ లో ఒకింత ఇనాక్టివ్ గా ఉన్న మండవ వెంకటేశ్వరరావు, మాజీ మంత్రులు దేవేందర్ గౌడ్ కుమారులు, నాగం జనార్ధన్ రెడ్డి కుమారుడు, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాసరెడ్డి తదితరులు బాబు ఇలా పిలిస్తే అలా టీడీపీలోకి వచ్చి యాక్టివ్ అయ్యేందుకు సదా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఈ లెక్కన 2028 చివరలో జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీ టీడీపీ సత్తా చాటడం ఖాయమేనన్న విశ్లేషణలు సాగుతున్నాయి.

# వైసీపీకి ప్రధాన శత్రువు ఎవరంటే?



అమరావతి,రాజకీయాల్లో ప్రత్యర్థులను గుర్తించడం సులువు. సొంత పార్టీలోని శత్రువుల్ని పసిగట్టడం కష్టం. ఒకవేళ ఫలానా వ్యక్తుల వల్ల రాజకీయంగా నష్టపోతున్నామని గుర్తించేలోపే, జరగాల్సింది జరిగిపోయి వుంటుంది. అయితే వైసీపీలో విచిత్రమైన పరిస్థితిని చూడొచ్చు. సహజంగా అధినాయకుడికి దగ్గరగా ఉన్నోళ్లు, మరికొందరిని పార్టీ కోసం పని చేయడానికి ఆలోచిస్తుంటారు. వైసీపీలో మాత్రం అందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది.ఒకవైపు కూటమి పాలనపై వ్యతిరేకత వుందనే ప్రచారం క్రమంగా పెరుగుతోంది. మరోవైపు వైఎస్ జగన్ నాయకత్వంలో పని చేయడానికి ఇప్పటికీ సొంతపార్టీలోని కొందరు భయపడుతున్నారు. అలాగే క్షేత్రస్థాయి నుంచి ఇలాంటి భయాందోళనల్ని వైసీపీ శ్రేణుల్లో చూడొచ్చు. నాయకులుగా ఎదగడానికి ప్రతిపక్షం అనేది మంచి వేదిక అవుతుందని జగన్ తరచూ చెబుతున్నారు. ఆయన అన్నది నిజమే.ప్రతిపక్షంలో బాగా పని చేసేవాళ్లకు మంచి భవిష్యత్ వుంటుందని జగన్ హామీ ఇస్తున్నారు. ఇంత వరకూ బాగానే వుంది. కానీ ఆచరణలోనే ఎంత వరకు అమలవుతుందనే శంక వైసీపీ నాయకులు, కార్యకర్తల్ని వెంటాడుతోంది. జగన్‌ను సీఎంగా చూడాలనే తపనతో పదేళ్లు కష్టపడ్డామని, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాతకనీసం పలకరించే దిక్కు లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేపు మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే , ఇంతకంటే భిన్నమైన పరిస్థితి ఏముంటుందనే ప్రశ్నకు, అనుమానాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధిష్టానంపై వుంది.ప్రతిదీ చంద్రబాబు, లోకేశ్‌తో వైసీపీ కార్యకర్తలు, నాయకులు పోల్చుకుంటున్నారు. చంద్రబాబు, లోకేశ్‌ను టీడీపీ కార్యకర్తలు సులువుగా కలుసుకుంటున్నారు. కాకపోతే, ఒకరోజు అటూఇటూ కావచ్చు. ఇదే వైసీపీ కార్యకర్తలకు జగన్‌ను కలవడం అసాధ్యం. పైగా వైసీపీలో ఏకనాయకత్వం. టీడీపీతో పోల్చుకుంటే ప్రజాస్వామ్య లక్షణాలు చాలా తక్కువ. నియోజకవర్గ నాయకుడి కుటుంబం పదవులు, ఆదాయం పంచుకున్న తర్వాత, ఇంకా మిగిలి వుంటే గ్రామస్థాయిలో నాయకులకు, కార్యకర్తలకు సాయం చేస్తారు.ఎంతసేపూ తాము తప్ప, ఇతరులెవరూ అధిష్టానానికి దగ్గర కాకూడదని, అలాగే గుర్తింపు పొందకూడదనే మనస్తత్వం వైసీపీ నాయకులది.ఈ ధోరణే వైసీపీకి ప్రధాన శత్రువు. అందుకే టీడీపీని అన్ని కులాల వాళు తమ పార్టీగా భావించినట్టు, వైసీపీ వరకూ వచ్చేసరికి ఆలోచనలో పడుతుంటారు. అందరినీ కలుపుకునే పోయే మనస్తత్వం వైసీపీలో పెరిగే వరకూ, ఆ పార్టీ ఎదుగుదల అంతంత మాత్రమే.ఇప్పుడైనా కూటమి తనకు తానుగా తెచ్చుకున్న వ్యతిరేకత కారణంగా, వైసీపీలో జోష్ కనిపిస్తోంది. అంతే తప్ప, ఆ పార్టీ పెద్ద నాయకులు చేసిందేమీ లేదు. ఇప్పటికైనా వైసీపీ తన స్వభావాన్ని సంస్కరించుకోవాల్సిన అవసరం వుంది. ప్రజలతో పాటు అన్ని వర్గాలను కలుపుకుని పోయే మనస్తత్వాన్ని అలవరచుకోవాలి. చేజేతులా అభిమానుల్ని దూరం చేసుకునే మనస్తత్వాన్ని పోగొట్టుకోవాలి. ఒక్కసారి దూరమైన వాళ్లు, మళ్లీ చేరువ కావడం కష్టం. కావున అన్ని వర్గాల్ని ఆకట్టుకునేలా, పార్టీలో వాళ్ల ప్రాతినిధ్యాన్ని, నాయకత్వాన్ని పెంచితేనే, వైసీపీకి మంచి భవిష్యత్.

# కేటీఆర్ జైలుకు పోవాలనుకుంటున్నారా ?



హైదరాబాద్,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జైలుకు పోవాలని ఉత్సాహపడుతున్నారా, ఆయన అరెస్ట్ గురించి తన పార్టీ వారితో చేసిన వ్యాఖ్యలు ఒక వైపు వైరల్ అవుతున్నాయి. ఆయనను ఏసీబీ అధికారులు తాజాగా పిలిచి విచారించారు. ఫార్ములా వన్ రేసింగ్ లో అవినీతి జరిగిందనే ఆరోపణలపై ఏసీబీ దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో కేటీఅర్ ని మూడవసారి విచారణకు పిలిచారు.దాని మీద కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. ఈ కేసు విషయంలో ముప్పయి సార్లు అయినా ఏసీబీ ముందు విచారణకు తాను హాజరవుతాను అన్నారు. అంతే కాదు ఈ కేసులో జైలుకు వెళ్లాల్సి వచ్చిన భయపడేది లేదని అన్నారు. గతంలో తెలంగాణా రాష్ట్ర సాధన కోసం జైలుకు వెళ్లాను అని గుర్తు చేశారు.తన పైన తమ పార్టీ వారి పైనా తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారు అని ఆయన అన్నారు. అయినా తాము ఎప్పటికీ వెనక్కి తగ్గేది లేదని ప్రభుత్వం చేసే ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. విచారణ పేరుతో అరెస్టు చేసి జైలులో వేసినా తాను రెడీ అంటూ పదే పదే చెప్పారు కేటీఅర్.అయితే కేటీఆర్ ఈ ప్రస్తావన ఎందుకు తెస్తున్నారు అన్నదే చర్చగా ఉంది. నిజానికి సోమవారం కేటీఆర్ ని ఏసీబీ పిలిచి ఏడు గంటల పాటు ఫార్ములా వన్ రేసింగ్ లో అవినీతి జరిగిందనే ఆరోపణలపై విచారించింది. దానికి కేటీఆర్ కూడా ఓపికగా జవాబులు చెప్పారని అంటున్నారు. అయితే అవసరం అయితే మరోసారి కేటీఆర్ ఏసీబీ ముందు హాజరు కావాల్సి ఉంటుందని అధికారులు కోరారని అంటున్నారు. అంటే మరోసారి కూడా కేటీఆర్ ని ఏసీబీ పిలుస్తుంది అని అంటున్నారు.అయితే ఈ తరహా విచారణల తరువాత అరెస్ట్ చేస్తారు అని కేటీఆర్ నమ్ముతున్నారు. అందుకే అరెస్ట్ చేసుకోండి జైలులో కూడా వేయండి అని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ చేశారు. తాను ప్రజల పక్షంగా ఉన్నాను దేనికీ జడిసేది లేదని ఆయన చెబుతున్నారు. మరో వైపు చూస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అయింది.ఇక ఇపుడిపుడే ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకత పెరుగుతోంది. ఇదే సమయంలో విపక్షంగా బీఆర్ఎస్ కూడా పుంజుకుంటోంది. అయితే సరైన పొలిటికల్ హైప్ అయితే రావడం లేదు. దాని కోసమే బీఆర్ఎస్ నేతలు చూస్తున్నారు. అందుకేనా కేటీఆర్ తనను అరెస్ట్ చేయమని కోరుతున్నారా లేక పదే పదే ఈ మాటలు అంటూ ప్రభుత్వానికి సవాల్ చేస్తున్నారా అన్న చర్చ సాగుతోంది.రాజకీయాల్లో కీలకంగా ఉన్న వారికి ఎవరికైనా అరెస్టు చేసి జైలులో పెడితే కచ్చితంగా అది సింపతీగా మారుతుంది. అనేక సందర్భాలలో అది రుజువు అయింది. బహుశా అందుకేనా కేటీఅర్ నోట అరెస్టు జైలు అన్న మాటలు వస్తున్నాయని అంతా చర్చించుకుంట ున్నారు.దీని మీద కాంగ్రెస్ మంత్రి సీతక్క అయితే కేటీఆర్ మీద సెటైర్లు వేశారు. జైలులు పోవాలని కేటీఆర్ ఉత్సాహపడుతున్నారు అని ఆమె అన్నారు. తన చెల్లెలు జైలుకు వెళ్ళి బీసీ నినాదం అందుకుందని తాను కూడా వెనకబడకుండా జైలుకు పోతే ఏదో ఒక పథకం అక్కడ రచించుకుని బయటకు రావాలను చూస్తున్నారు అని ఎద్దేవా చేశారు. రాజకీయంగా ఏదో ఆశించే కేటీఆర్ జైలుకు పోవాలని చూస్తున్నారు అని ఆమె అన్నారు.నిజంగా కేటీఆర్ అలా ఆలోచిస్తున్నారా అన్నది ఒక చర్చ అయితే కేటీఅర్ కోరినట్లుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తుందా అన్నది మరో చర్చగా ఉంది. ఎందుకంటే రాజకీయాల్లో ఎత్తులు పై ఎత్తులు ఉంటాయి. అందువల్ల ప్రతిపక్షానికి లాభం కలిగే పని అయితే చేయదని అంటున్నారు. మరి కేటీఆర్ జైలు అరెస్టు అని ఎందుకు అంటున్నారు అంటే అరెస్టు అయినా కాకపోయినా క్యాడర్ లో కొత్త వేడిని ఈ విధంగా పుట్టించడానికే అని అంటున్నారు. చూడాలి మరి కేటీఆర్ అరెస్టు ఉంటుందా లేదా అన్నది. ఏమైనా కేటీఆర్ అరెస్ట్ దాకా వ్యవహారం సాగుతుందా అన్నదే పెద్ద ప్రశ్నగా ఉంది.

# మనసులో ఆవేదనను వెళ్లగక్కిన కాంగ్రెస్? సీనియర్? నేత...!



హైదరాబాద్,ఏ పార్టీ నాయకుడైనా ఆయన పార్టీ అధికారంలోకి వస్తే మంత్రి కావాలనుకుంటా డు. అవకాశం, అదృష్టం ఉంటే ముఖ్యమంత్రి కావాలని అనుకుంటాడు. కొందరు ఎంత సీనియర్లయినా మంత్రి కాలేరు. ముఖ్యమంత్రి కాలేరు. అందుకు ఎన్నో కారణాలు, ఎన్నెన్నో అడ్డంకులు. కొందరు అసలు మంత్రిగా పనిచేయకుండానే ముఖ్యమంత్రి పదవి అలంకరిస్తారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి మంత్రిగా కూడా చేయకుండానే ఏకంగా సీఎం అయ్యాడు. తెలంగాణ కాంగ్రెసు నాయకుల్లో జానారెడ్డి చాలా సీనియర్?. సుదీర్ఘకాలం మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది.కాని కాంగ్రెసు అధికారంలోకి వచ్చినా ఆయన సీఎం కాలేకపోయాడు. ఆ ఆవేదన ఇప్పటికీ ఆయనలో ఉంది. ఇన్నేళ్లు మనసులోనే దాచుకున్న ఆవేదనను తాజాగా బయటకు వెళ్లగక్కాడు. తనకు సీఎం పదవి మిస్సయిందని అన్నాడు. ఆయనలో ఆవేదన ఉండటం సహజం. ఆయన సీనియారిటీతో, అనుభవంతో పోలిస్తే రేవంత్? రెడ్డి బచ్చా అని చెప్పొచ్చు. రాజకీయాల్లో కొన్నిసార్లు ఆశించినవన్నీ జరగవని జానారెడ్డి నిర్వేదంగా అన్నారు. కాని ఇక ఆయన ఆశ ఫలించే అవకాశం లేకపోవచ్చు.తెలుగుదేశం పార్టీలో చేరి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు జానారెడ్డి. 1983లో చలకుర్తి నియోజకవర్గం నుండి తొలిసారిగా రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. అదే నియోజకవర్గం నుండి ఆరు పర్యాయాలు శాసనసభకు ఎన్నికై ఉమ్మడి ఏపీలో వివిధ మంత్రి పదవులు నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత దీర్ఘకాలం మంత్రిగా పనిచేసిన వ్యక్తిగా కాసు బ్రహ్మానందరెడ్డి నెలకొల్పిన రికార్డును అధిగమించారు. 1988లో 30 మంది క్యాబినెట్ మంత్రులను మార్చడంపై జానారెడ్డి ఎన్‌టి రామారావుతో విభేదించారు.తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2004 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి కృషి చేశారు. 2004లో అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో హెూం శాఖ మంత్రిగా పనిచేశారు. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ఆయన పార్టీని ధిక్కరించిన దాఖలాల్లేవు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ప్రతీసారి ఆయనకు ఏదో ఒక మంత్రి పదవీ దక్కేది. అత్యధిక కాలం మంత్రిగా పని చేసిన రికార్డు సైతం జానారెడ్డి పేరు పైనే ఉంది. తెలంగాణ కోసం పోరాడిన నేతగానూ ప్రజల్లో ఆయనకు గుర్తింపు ఉంది.రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆయనే ముఖ్యమంత్రి అన్న రేంజులో ప్రచారం జరిగింది. కాని టీఆర్?ఎస్?వచ్చింది. ఆ సమయంలో విపక్ష నేతగా జానారెడ్డి కీలక పాత్ర పోషించారు. టీఆర్ఎస్ ముందస్తు ఎన్నికలకు వెళ్లి ప్రతిపక్ష పార్టీలన్నింటికీ భారీ షాకిచ్చింది. ముందస్తు ఎన్నికల్లో జానారెడ్డి టీఆర్ఎస్ అభ్యర్థి నోముల నర్సింహయ్య చేతిలో ఓటమిపాలయ్యారు. వరుసగా రెండోసారి కూడా కాంగ్రెస్ అధికారానికి దూరమవడంతో ఆ పార్టీ పరిస్థితి మరింత దిగజారి పోయిం ది.ఇలాంటి సమయంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య అకాల మృతిచెందారు. ఆయన మరణంతో నాగార్జున్ సాగర్లో ఉప ఎన్నిక అనివార్య మైంది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి జనారెడ్డి పోటీ చేశారు. టీఆర్ఎస్ నుంచి నోముల నర్సింహయ్య కుమారుడు భగత్ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో జానారెడ్డి గెలుస్తాడని అంతా భావించినా టీఆర్ఎస్ కు సానుభూతి పవనాలు కలిసి వచ్చాయి. దీంతో వరుసగా జానారెడ్డి ఓటమి పాలయ్యారు.ఈ ఓటమిని జీర్ణిం చుకోలేని జానారెడ్డి ఇకపై తాను పోటీ చేయనంటూ ప్రకటించారు. ఇదిలా ఉంటే నాగార్జున్ సాగర్ ఉప ఎన్నిక ముందు జానారెడ్డి టీఆర్ఎస్ లో చేరుతారనే ప్రచారం భారీగా సాగింది. అయితే తాను కాంగ్రెస్ లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన కుమారుడు రఘువీర్ రెడ్డి కాంగ్రెస్ లో యువ నాయకుడిగా కొనసాగుతున్నారు. అయితే జానారెడ్డి మాత్రం మునుపటిలా యాక్టివ్ పాలిటిక్స్ చేయడం లేదు. కాంగ్రెస్ కు పూర్తిగా దూరంగా ఉంటున్నారు.

# కౌశిక్ రెడ్డికి షాకిచ్చిన హైకోర్టు.. ఏం జరిగింది?




హైదరాబాద్,బీఆర్ఎస్ ఫైర్ బ్రాండ్ నాయకుడు, హుజూరాబాద్ నుంచి తొలిసారి విజయం దక్కించుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు భారీ షాక్ ఇచ్చింది. తనపై నమోదైన కేసును కొట్టి వేయాలని కోరుతూ .. ఆయన పెట్టుకున్న పిటిషన్‌ను కొట్టి వేసింది. ఇదే సమయంలో కీలక వ్యాఖ్యలు కూడా చేసింది. అవినీతి కేసులు ఎదుర్కొంటున్న వారు.. కోర్టులను ఆశ్రయించడం మొదలు పెడితే.. కేసుల సంఖ్య పెరిగిపోతుందని పేర్కొనడం గమనార్హం. ఈ నేపథ్యంలో కేసును కొట్టి వేస్తున్నట్టు తెలిపింది.దీంతో తనపై నమోదైన కేసును కొట్టివేయాలన్న కౌశిక్‌రెడ్డికి భారీ ఎదురు దెబ్బ తగిలినట్టు అయింది. గత ఎన్నికలకు ముందు హుజూరాబాద్ నియోజకవర్గంలో పర్యటించినప్పుడు.. తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్టు చెప్పిన పాడి.. తనను గెలిపించాలని ప్రజలకు విన్నవించారు. ఇదే సమయంలో ఎన్నికల కోసం ప్రచార ఖర్చును కొందరు బడావ్యాపారులు భరించేలా కూడా ఆయన చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే ఓ గ్రానైట్ వ్యాపారిని రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నది ఆయనపై వచ్చిన ఆరోపణ.అయితే.. సదరు వ్యాపారి భార్య.. ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు. దీంతో కౌశిక్ రెడ్డి విజయం దక్కించుకున్నాక.. తమను వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ వేధింపులతో వ్యాపారం కూడా చేసుకోలేకపోతున్నామని ఆమె చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే పాడిపై సదరు బాధితురాలు.. కేసు పెట్టారు. రూ.50 లక్షలు ఇవ్వాలంటూ కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.దీనిపై పోలీసులు కేసు పెట్టారు. అయితే.. ఈ కేసు రాజకీయ కారణాలతో మోపారని.. తాను ఎవరినీ సొమ్ములు అడగలేదని కౌశిక్ రెడ్డి చెబుతు న్నారు. ఈ కేసు కొట్టివేయాలని కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన కోర్టు..కౌశిక్ పిటిషన్‌ను కొట్టి వేసింది. దీనిపై విచారణ సాగించాలని.. నిజానిజాలు తేల్చాలని పోలీసులకు సూచిం చింది.

# లోకేష్ కు బాబే విలన్.. బాంబు పేల్చిన ఓవైసీ!



అమరావతి,తెలంగాణ రాజకీయాల్లోనే కాదు, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ హాట్ టాపిక్‌గా మారిన అంశం... టీడీపీ భవిష్యత్ నాయకత్వంపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓవైసీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా చంద్రబాబు, లోకేష్, జూనియర్ ఎన్టీఆర్ పేర్లు ప్రస్తావించడంతో తెలుగు రాష్ట్రాల్లో ఈ వ్యాఖ్యలు చర్చనీయాం శమయ్యాయి.

–చంద్రబాబుకు ఓవైసీ కీలక సూచన

ఎంఐఎం పార్టీ సమావేశంలో ప్రసంగించిన ఓవైసీ, నారా లోకేష్ ప్రస్తావన తీసుకొచ్చారు. “ఇప్పటికే చంద్రబాబు గారు సుదీర్ఘంగా పదవులు అనుభవించారు. ఇక రాజకీయ ప్రస్థానానికి ముగింపు పలికే సమయం వచ్చింది. లోకేష్‌ను ముందుకు నడిపించండి. లేకపోతే ఆయన భవిష్యత్తును మీ చేతుల మీదుగా నాశనం చేస్తారు” అంటూ వ్యాఖ్యానించారు. దీంతో చంద్రబాబు తండ్రిగా, నాయకుడిగా తీసుకోవాల్సిన నిర్ణయంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

–జూనియర్ ఎన్టీఆర్ పేరు ప్రస్తావన

ఓవైసీ ప్రసంగంలో జూనియర్ ఎన్టీఆర్ పేరు ప్రస్తావించడంతో సభలో కాసేపు హెూరెత్తింది. “ప్రస్తుతం ఎన్టీఆర్ రాజకీయాల్లో లేరు కదా..? కానీ ఆయనకీ పాపులారిటీ ఉందని చెబుతున్నారు. ఆయన రాజకీయాల్లోకి వచ్చినా, లోకేష్‌కి పోటీ అయినా అవుతారా?” అంటూ ఓవైసీ అనడం గమనార్హం. ఈ వ్యాఖ్యలతో ఎన్టీఆర్ రాజకీయ రీ ఎంట్రీపై కూడా ఊహాగానాలు ఊపందుకున్నాయి.

–ఓవైసీ వ్యాఖ్యల వెనుక అసలేముంది?

ఓవైసీ ఈ వ్యాఖ్యలు ఎందుకు చేశారు? చంద్రబాబు ఇటీవల తెలంగాణలో తెలుగుదేశం పార్టీ పునర్నిర్మాణంపై ఇచ్చిన హింట్‌కి ఇది రియాక్షనా? లేదా 2024 ఎన్నికల సమయంలో ఎంఐఎం జగన్‌కు పరోక్ష మద్దతునిచ్చిందన్న ఆరోపణల నేపథ్యంలో తాను ‘తెదేపా వ్యూహంపై’ సూచనలిచ్చారా? అనే ప్రశ్నలు జ్వలిస్తున్నాయి.

–లోకేష్ నాయకత్వానికి అవకాశం ఇవ్వాలని సూచన

“చంద్రబాబు ఎన్నాళ్ళైనా బాధ్యతలు వహించారు. ఇప్పుడు నారా లోకేష్‌కు బాధ్యతలు అప్పగించాలి. యువతకే అవకాశం ఇవ్వాలి. చంద్రబాబు ఇంకా కొనసాగితే లోకేష్ భవిష్యత్తు నాశనం కావచ్చు” అని ఓవైసీ తన వ్యాఖ్యల్లో స్పష్టం చేశారు. అయితే ఓవైసీ ఈ మాటల ద్వారా ఏ పార్టీకి ఏమిటీ సంకేతాలు ఇచ్చారన్నది మాత్రం స్పష్టంగా తెలియరాలేదు.ఓవైసీ వ్యాఖ్యలతో తెలుగుదేశం పార్టీలో నాయకత్వ మార్పు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. నిజంగానే చంద్రబాబు రిటైరయ్యే సూచనలు ఉన్నాయా? లోకేష్ పూర్తి బాధ్యతలు స్వీకరించనున్నారా? లేదా జూనియర్ ఎన్టీఆర్‌కు రాజకీయ అవకాశాలు తలుపుతట్టనున్నాయా? అన్నదిపై వచ్చే రోజుల్లో స్పష్టత రానుంది.

# ట్రంప్‌ను అంతమొందించే కుట్ర



జెరూసలెం,అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఇరాన్ చంపాలని చూస్తున్నదని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ సంచలన వ్యాఖ్యలు చేశారు. టెహ్రాన్ టార్గెట్ ట్రంపేనని, ఆ దేశానికి ప్రథమ శత్రువు అమెరికా అధ్యక్షుడేనని చెప్పారు. అణు ఒప్పందాన్ని రద్దు చేసినందుకే ట్రంప్‌ను లేకుండా చేయాలని ఇరాన్ భావిస్తున్నదని ఆరోపించారు. 2024లో రెండుసార్లు ఆయనను అంతమొందించడానికి ఇరాన్ ప్రయత్నించిందన్నారు. ఇజ్రాయెల్–ఇరాన్ పరస్పర దాడుల నేపథ్యంలో నెతన్యాహూ మాట్లాడుతూ.. ట్రంప్‌ను చంపాలని ఇరాన్ చూస్తున్నది. ఆయనే ఇరాన్‌కు నంబర్‌వన్ శత్రువు. ట్రంప్ నిర్ణయాత్మక నాయకుడు. బలహీనమైన రీతిలో బేరసారాలు చేయడానికి ఆయన ఎప్పుడూ ఇష్టపడరు. ప్రత్యర్థికి లొంగిపోరు. గతంలో జరిగిన నకిలీ అణుఒప్పందాన్ని రద్దుచేసి.. ఖాసిమ్ సులేమానీని మట్టుబెట్టారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధం ఉండకూడదని చాలా స్పష్టంగా చెప్పారు. అంటే వారు యురేనియంను శుద్ధి చేయకూడదు. ఈ నేపథ్యంలో ట్రంప్ కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో ఇరాన్‌కు డొనాల్డ్ ట్రంప్ ప్రధాన శత్రువుగా మారారు. అందుకే ఆయనను చంపాలని చూస్తున్నదని చెప్పారు.ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనే ఉద్దేశంతోనే ఇరాన్ అణు కార్యక్రమాలు చేపడుతున్నదని నెతన్యాహూ అన్నారు. తమ దాడులు ఇరాన్ అణు కార్యక్రమాన్ని చాలావరకు వెనక్కి నెట్టాయని చెప్పారు. ప్రపంచ దేశాలన్నింటికీ ఇరాన్ పెనుముప్పుగా మారుతున్నదని వెల్లడించారు. అందుకే, దాడులు చేయడం తప్ప తమకు మరో అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. ముప్పును సమూలంగా తొలగించేంతవరకు తమ పోరాటం ఆగదని, ఇజ్రాయెల్ తనను తానే కాకుండా ప్రపంచాన్ని కూడా రక్షిస్తున్నదని చెప్పారు.కాగా, తమ దాడుల్లో ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇంటెలిజెన్స్ చీఫ్ బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ కజేమి, ఆయన డిప్యూటీ జనరల్ హసన్ మహాకిక్ చనిపోయారని నెతన్యాహూ వెల్లడించారు. ఐఆర్‌జీసీ నిఘా విభాగానికి చెందిన మరో కీలక అధికారిని కూడా మట్టుబెట్టినట్లు తెలిపారు. ఐడీఎఫ్ వైమానిక దాడుల్లో ఇప్పటికే రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అధిపతి కూడా మరణించిన విషయం తెలిసిందే.

## ఖమేనీ హత్యకు యత్నాలు

టెహ్రాన్,ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం మరింత ముదురుతున్నది. క్షిపణులు, డ్రోన్లతో ఇరు దేశాలు దాడులు ప్రతిదాడులకు పాల్పడుతున్నాయి. ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. దీంతో టెహ్రాన్ సైన్యానికి చెందిన అత్యున్నత అధికారుల తోపాటు పదుల సంఖ్యలో అణు శాస్త్రవేత్తలు మృతిచెందారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీని కూడా లక్ష్యంగా చేసుకొని ఐడీఎఫ్ దళాలు దాడులు చేస్తున్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత వారు ఈశాన్య టెహ్రాన్‌లోని అండర్‌గ్రౌండ్ బంకర్‌లో తలదాచుకుంటున్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. ఇక ఇజ్రాయెల్ దాడులకు ఇరాన్ కూడా అదేరీతిలో ప్రతిస్పదిస్తున్నది. ఇజ్రాయెల్‌పై క్షిపణుల వర్షం కురిపిస్తున్నది. ఈ బాలిస్టిక్ క్షిపణుల దాడిని ఇజ్రాయెల్ గొప్పగా చెప్పుకునే ఐరన్ డోమ్ కూడా అడ్డుకోలేకపోయింది. శత్రుదుర్భేధ్య రక్షణ వ్యవస్థగా చెప్పుకునే దానిని ఇరాన్ క్షిపణులు చీల్చుకుంటూ వెళ్లి ఇజ్రాయెల్ భూభాగంలో పడుతున్నాయి. దీంతో ప్రధాన నగరాలైన టెల్ అవీవ్, జెరూసలెంలో భారీ నష్టాన్ని మిగులుస్తున్నాయి.

# వ్యాపార విస్తరణలో వేగం పెంచాలి: సీఎండీ ఎన్.బలరామ్




హైదరాబాద్,సింగరేణి సంస్థ చేపట్టిన వ్యాపార విస్తరణ ప్రాజెక్టుల్లో పనులు మందకొడిగా సాగితే ఉపేక్షించేది లేదని సీఎండీ ఎన్.బలరామ్ హెచ్చరించారు. సోలార్, పవన, జియో థర్మల్ విద్యుత్, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, మినిరల్స్, మిథనాల్ ఉత్పత్తి వంటి 28 రకాల విస్తరణ ప్రాజెక్టులపై ఆయన విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, కొన్ని ప్రాజెక్టులు ప్రారంభదశలో ఉండగా, మరికొన్నింటిపై ఒప్పందాలు కుదిరాయని, కానీ పనుల పురోగతి ఆశించినంతగా లేదని అసహనం వ్యక్తం చేశారు. 10 రోజులలోపే ప్రతీ ప్రాజెక్టులో ప్రగతి కనిపించాల్సిన అవసరం ఉందని స్పష్టంచేశారు.ఇకపై ప్రతీ వారం విస్తరణ ప్రాజెక్టులపై ప్రత్యేక సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా ఉన్నందున, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.సమావేశంలో డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, 20 విభాగాల జీఎంలు పాల్గొన్నారు. రూఫ్‌టాప్ సోలార్, కోల్ వాషరీస్, హైడ్రాలిక్ కన్వేయర్లు వంటి అంశాలపై కూడా చర్చించారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com